జోరుగా దోబీఖానా నిర్మాణం


జగన్నాథపురంలో నిర్మిస్తున్న దోబీఖానా


గ్రౌండ్ ఫ్లోర్‌లో నిర్మించిన సిమ్మెంట్ కుండీలు, బల్లలు

సీతంపేట: జీవీఎంసీ 43వ వార్డు జగన్నాథపురంలో రూ.39 లక్షలతో చేపడుతున్న రెండంతస్తుల దోబీఖానా నిర్మాణ పనులు జోరుగా జరుగుతున్నాయి. వార్డులోని శ్మశానవాటిక పక్కన ఉన్న దోబీఖానా శిథిలమవడంతో రజకులు చాలా కాలంగా ఇబ్బంది పడుతున్నారు. కార్పొరేటర్ పెద్దిశెట్టి ఉషశ్రీ చొరవతో దోబీఖనా కొత్తగా నిర్మించడానికి రూ.39 లక్షలు మంజూరు చేయించారు. ఈ నిధులతో రెండంతస్తుల్లో గ్రౌండ్ ఫ్లోర్‌లో దోబీఖానా, మొదటి అంతస్తులో సామాజిక భవనం నిర్మిస్తున్నారు. ఇప్పటికే చాలా వరకు పనులు పూర్తయ్యాయి. గ్రౌండ్ ఫ్లోర్‌లో సిమెంట్ కుండీలు, బల్లలు నిర్మించారు. మరికొద్ది రోజుల్లో పనులు పూర్తి కానున్నాయి. అన్ని సదుపాయాలతో దోబీఖానా అందుబాటులోకి రానుండటంతో స్థానిక రజకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

క్లుప్తంగా

శ్రీవారికి పట్టు వస్త్రాల సమర్పణ


శ్రీవారికి సమర్పించేందుకు పట్టు వస్త్రాలను తీసుకుని వస్తున్న అర్చకులు

కొమ్మాది: రుషికొండలోని శ్రీమహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం వారాంతపు పూజలు వైభవంగా జరిగాయి. ముందుగా శేషవస్త్రం, అభిషేక సామగ్రిని ప్రదక్షిణగా మంగళవాయిద్యాల నడుమ తీసుకెళ్లి అభిషేకాలు నిర్వహించి, శ్రీవారిని ప్రత్యేకంగా అలంకరించారు. అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. ఈ కార్యక్రమంలో వేద పండితులు, అర్చకులు, ఆలయ అధికారులు పాల్గొన్నారు.

రైల్వేస్టేషన్‌లో 41.1 కేజీల గంజాయి స్వాధీనం

జీఆర్పీ అదుపులో రవాణాదారుడు


గంజాయి, రవాణాదారుడితో జీఆర్పీ సిబ్బంది

తాటిచెట్లపాలెం: విశాఖపట్నం రైల్వేస్టేషన్‌లో గంజాయిని అక్రమంగా తరలిస్తున్న నిందితుడిని రైల్వే పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. జీఆర్పీ సిబ్బంది తెలిపిన వివరాలిలా.. జీఆర్పీ ఉన్నతాధికారుల ఆదేశాలతో జీఆర్పీ ఇన్‌స్పెక్టర్ సిహెచ్.ధనుంజయనాయుడు ఆధ్వర్యంలో జీఆర్పీ, ఆర్పీఎఫ్ సిబ్బంది కలిసి విశాఖ రైల్వేస్టేషన్‌లోని ప్లాట్‌ఫారాల్లో శుక్రవారం ముమ్మర తనిఖీలు నిర్వహించారు. తూర్పు గోదావరి జిల్లా జగ్గంపేటకు చెందిన బస్వా అప్పారావు వద్ద నుంచి అక్రమంగా రవాణా చేస్తున్న సుమారు రూ.2.05 లక్షల విలువైన 41.1 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నారు. ఇతడిని అదుపులోకి తీసుకుని, రిమాండ్ నిమిత్తం కోర్టులో హాజరు పరిచినట్లు జీఆర్పీ సిబ్బంది తెలిపారు.

వ్యక్తి అదృశ్యం


నాగేశ్వరరావు

మర్రిపాలెం: కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ వ్యక్తి అదృశ్యమైన ఘటన వెలుగుచూసింది. వివరాలిలా.. నాగేశ్వరరావు అనే వ్యక్తి జ్ఞానాపురం రైల్వే స్టేషన్‌లో లైసెన్స్ కూలీగా పనిచేస్తుంటాడు. ఇతడు భార్య, కుమార్తెతో కలిసి మధురవాడలో నివసిస్తున్నాడు. ప్రస్తుతం అనారోగ్యం కారణంగా తాటిచెట్లపాలెం సంజీవయ్య కాలనీలో ఉంటున్న అతడి సోదరుడు ఇంటి వద్ద నుంచి పనికి వెళ్తున్నాడు. ఈ నెల 18న పనికి వెళ్లి వస్తానని చెప్పి సోదరుడి ఇంటి వద్ద నుంచి నాగేశ్వరరావు బయలుదేరి వెళ్లి తిరిగి రాలేదు. అంతటా వెతికినా ఆచూకీ తెలియకపోవడంతో అతడి సోదరుడు త్రిమూర్తులు కంచరపాలెం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సీఐ ఎస్.భాస్కరరావు నేతృత్వంలో హెడ్ కానిస్టేబుల్ వి.వి.రమణ కేసు దర్యాప్తు చేపట్టారు. నాగేశ్వరరావు ఆచూకీ తెలిసిన వారు పోలీస్ స్టేషన్‌లో సమాచారం అందించాలని కోరారు.

బాలిక అదృశ్యం

మర్రిపాలెం: కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ బాలిక అదృశ్యమైన ఘటన జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలిలా.. గవర కంచరపాలెంలో తల్లిదండ్రులతో కలిసి నివసిస్తున్న గిరి దుర్గాభవాని ఈ నెల 23వ తేదీ గురువారం రాత్రి 9 గంటలకు సోడా తెస్తానని చెప్పి ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. అంతటా వెతికారు. ఎక్కడా ఆచూకీ లభించకపోవడంతో ఆమె తల్లి గిరి సుహాసిని శుక్రవారం ఐదో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ ఎస్.భాస్కరరావు నేతృత్వంలో ఏఎస్ఐ కనకరాజు కేసు దర్యాప్తు చేపట్టారు. అదృశ్యమైన బాలిక పదో తరగతి చదువుతోంది. 4 అంగుళాల 5 అడుగుల ఎత్తు, చామనఛాయ రంగు కలిగి ఉంటుంది. ఆచూకీ తెలిసిన వారు సమాచారం అందించాలని కంచరపాలెం పోలీసులు కోరారు.

స్ట్రాంగ్ రూమ్‌లను పరిశీలించిన కలెక్టర్


స్ట్రాంగ్ రూమ్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ మల్లికార్జున, సీపీ రవిశంకర్

మహారాణిపేట: ఏయూ ఇంజినీరింగ్ కళాశాల ప్రాంగణంలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌లు, కౌంటింగ్ కేంద్రాలను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ మల్లికార్జున శుక్రవారం మధ్యాహ్నం పరిశీలించారు. పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ. రవిశంకర్, జాయింట్ కమిషనర్ ఫక్కీరప్ప, జాయింట్ కలెక్టర్ కె. మయూర్ అశోక్‌లతో కలిసి పార్లమెంట్, అంసెబ్లీకి సంబంధించిన ఈవీఎంల స్ట్రాంగ్ రూమ్‌లను తనిఖీ చేసి అక్కడి పరిస్థితులను గమనించారు. భద్రతాపరమైన చర్యలపై ఆరా తీశారు. సీసీ కెమెరాల పనితీరు, మానిటరింగ్ రూమ్ ద్వారా పర్యవేక్షణ గురించి సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఎన్నికల కమీషన్ నిబంధనల మేరకు అన్ని రకాల భద్రతా ప్రమాణాలను పాటిస్తూ కౌంటింగ్ కేంద్రాల వద్ద ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. పనులు వేగవంతం కావాలని సూచించారు. అనంతరం మీడియా ఫెసిలిటేషన్ కేంద్రాన్ని సందర్శించి అక్కడి పరిస్థితిని గమనించారు. ఆయా నియోజకవర్గాల ఆర్వోలు, అధికారులు, సిబ్బంది కలెక్టర్ వెంట ఉన్నారు.

రేపు స్కాలర్‌షిప్ టెస్ట్

దాబాగార్డెన్స్: ఆకాష్ ఎడ్యుకేషనల్ సర్వీసెస్‌లో మెడికల్, ఇంజినీరింగ్ ఫౌండేషన్ కోర్సుల్లో చేరేందుకు ఇన్‌స్టెంట్ అడ్మిషన్ కం స్కాలర్‌షిప్ టెస్ట్ ఈ నెల 26న నిర్వహించనున్నట్లు ఆకాష్ సౌత్ ఇండియా చీఫ్ అకడమిక్ బిజినెస్ హెడ్ ధీరజ్‌కుమార్ తెలిపారు. ఈ మేరకు శుక్రవారం నగరంలోని సంస్థ కార్యాలయంలో పోస్టర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆ రోజు ఉదయం 10 నుంచి 11 గంటలకు ఆకాష్ విద్యా సంస్థల కేంద్రాల్లో ఈ టెస్ట్ ఉంటుందని చెప్పారు. దాదాపు నాలుగు లక్షల మందికి పైగా ఆకాష్ విద్యా సంస్థలో చేరి అత్యుత్తమ ఫలితాలు సాధించారని తెలిపారు. విశాఖలోని ద్వారకానగర్, గాజువాక, మధురవాడలో కూడా ఈ పరీక్ష ఉంటుందని, 8 నుంచి 12వ తరగతి వరకు చదివే విద్యార్థులు, ఇంటర్ పూర్తయి నీట్, జేఈఈలో ఉత్తమ ఫలితాలు సాధించే దిశగా పోటీ పరీక్షలకు హాజరయ్యే లాంగ్ టర్మ్ విద్యార్థులు ఈ పరీక్షలో పాల్గొని 90 శాతం వరకు ఫీజు రాయితీ పొందవచ్చని తెలిపారు. డిఫెన్స్, టెర్రరిజం ఎఫెక్ట్ వ్యక్తులకు సంబంధించిన వారికి మరో 10 శాతం రాయితీ అదనంగా ఇస్తున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో సంస్థ రీజినల్ డిప్యూటీ డైరెక్టర్ మూర్తి, అసిస్టెంట్ డైరెక్టర్ లక్ష్మీనారాయణ, బ్రాంచ్ హెడ్ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

చురుగ్గా విభిన్న ప్రతిభావంతుల గుర్తింపు సర్వే


సర్వే చేస్తున్న ఎంఈవోలు సోమేశ్వరరావు, దివాకర్

కంచరపాలెం: విభిన్న ప్రతిభావంతుల గుర్తింపునకు విద్యా శాఖాధికారులు, సిబ్బంది ప్రత్యేక సర్వే నిర్వహిస్తున్నారు. గోపాలపట్నం మండల పరిధిలో సర్వే చురుగ్గా కొనసాగుతోంది. మండల విద్యా శాఖాధికారులు–1, 2 సోమేశ్వరరావు, దివాకర్ పర్యవేక్షణలో శుక్రవారం కంచరపాలెం పరిసర ప్రాంతాల్లో సర్వే చేశారు. ఈ సందర్భంగా ఎంఈవోలు మాట్లాడుతూ విభిన్న ప్రతిభావంతులకు ప్రభుత్వం అందిస్తున్న రాయితీలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. రవాణా భత్యం, దివ్యాంగుల భత్యం తదితర సౌకర్యాలు కల్పిస్తారన్నారు. ఇంత వరకు బుద్ధి మాంద్యం గల ఐదుగురు, వినికిడి లోపం ఒకరు, మెదడు పక్షవాతం ముగ్గురు చొప్పున దివ్యాంగులను గుర్తించామని తెలిపారు. వారిని సమీప పాఠశాలల్లో నమోదు చేయిస్తామన్నారు. సర్వే కార్యక్రమంలో సీఆర్పీ లంక చైతన్య, ఐఈఆర్టీ టీచర్లు మహాలక్ష్మి, మాధవి, జ్యోతినగర్ పాఠశాల హెచ్ఎం సిహెచ్.కిరణ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

26న ఎన్టీఆర్, కృష్ణ చిత్ర గీతాల సంగీత విభావరి

దాబాగార్డెన్స్ : నటరత్న ఎన్‌టీ రామారావు, సూపర్‌స్టార్ కృష్ణ జయంతి పురస్కరించుకుని ఈ నెల 26న అల్లూరి విజ్ఞాన కేంద్రం వేదికగా ఎన్‌టీఆర్, కృష్ణ చిత్రగీతాలతో దేవుడు చేసిన మనుషుల్లారా పేరిట సినీ సంగీత విభావరి నిర్వహించనున్నట్లు ఘంటసాల స్పోర్ట్స్ అండ్ కల్చరల్ అసోసియేషన్ వ్యవస్థాపక కార్యదర్శి చెన్నా తిరుమలరావు ఒక ప్రకటనలో తెలిపారు. సోమేశ్, ధనుంజయ్ సంగీత నిర్వహణలో ప్రముఖ గాయనీ, గాయకులు పలు గీతాలు ఆలపించనున్నారని, సంగీతాభిమానులు పాల్గొనాలని కోరారు.

నిల్వ నీరు దోమల ఉత్పత్తికి నిలయాలు

- పక్కాగా ఫ్రైడే డ్రైడే పాటించాలి
- జిల్లా మలేరియా అధికారి తులసీ

మద్దిలపాలెం: నిల్వ నీరు దోమల ఉత్పత్తికి ఆవాసాలుగా నిలిస్తున్నాయని, ఎప్పటికప్పుడు ఇళ్లలో నీటి నిల్వ లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా మలేరియా అధికారి తులసీ అన్నారు. ఫ్రైడే డ్రైడే కార్యక్రమాన్ని శుక్రవారం మద్దిలపాలెం, పిఠాపురం కాలనీ, హెచ్‌బీ కాలనీ, జాలరిపేట, ఎంవీపీ కాలనీ, తదితర ప్రాంతాలలో నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ఆమె పరిశీలించారు. ప్రతి శుక్రవారం డ్రైడే పాటించాలని కోరారు. ఇళ్లలో నీటి నిల్వలను గుర్తించే ఈ కార్యక్రమం ఎంతో కీలకమైందన్నారు. వారానికి పైగా నీరు నిల్వ ఉంటే లార్వా ఉత్పత్తి అవుతుందన్నారు. తద్వారా దోమల వృద్ధి చెందుతాయన్నారు. దోమ కాటుతో డెంగ్యూ, మలేరియా జ్వరాలు సోకుతాయన్నారు. నీటి నిల్వ లేకుండా ఇళ్లలో ఫ్రిజ్‌లు, ఏసీ, ఎయిర్ కూలర్, వాటర్ ప్లాంట్, మనీ ప్లాంట్‌ను శుభ్రం చేసుకోవాలని ఆమె సూచించారు. టైర్లు, ఖాళీ కొబ్బరి బొండాలు ఇంటి పరిసరాల్లో ఉంచొద్దన్నారు. ప్రతి ఒక్కరూ దోమ తెరలు వాడాలన్నారు. దోమకాటుకు గురి కాకుండా రక్షణ చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం ఇంటింటికి వెళ్లి పరిసరాలను తనిఖీ చేశారు. పలు సూచనలు, సలహాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సబ్ యూనిట్ అధికారులు నగేష్‌పట్నాయక్, శేషుబాబు, వెంకటేష్, సిబ్బంది పాల్గొన్నారు.

కనకమహాలక్ష్మికి క్షీరాభిషేక సేవ



క్షీరాభిషేక సేవలో కనకమహాలక్ష్మి

దాబాగార్డెన్స్ : బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించారు. ఉదయం 8 నుంచి 9 గంటల వరకు నిర్వహించిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. ప్రత్యేక పూజ ప్రతి శుక్రవారం నిర్వహించనున్నట్లు ఆలయ ఈవో పి. శ్రీనివాసులరెడ్డి తెలిపారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.500 చెల్లించిన యెడల పూజకు దంపతులు లేదా ఇద్దరిని అనుమతించనున్నట్లు చెప్పారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు 0891–2566514, 2711725 నంబర్లలో సంప్రదించవచ్చు. కార్యక్రమంలో ఆలయ ఏఈవోలు కె. తిరుమలేశ్వరరావు, వెంపలి రాంబాబు, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు కనకమహాలక్ష్మికి సహస్ర తులసీదళార్చన

కనకమహాలక్ష్మి దేవాలయంలో శనివారం ఉదయం 8 నుంచి 9 గంటల వరకు సహస్ర తులసిపూజ నిర్వహించనున్నారు. పూజలో పాల్గొనదలిచే భక్తులు రూ.1,500 పూజా రుసుం చెల్లించి పాల్గొనవచ్చు. భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, టౌన్‌కొత్తరోడ్డు శాఖ, అకౌంట్ నంబరు 060810011006691, ఐఎఫ్ఎస్‌సీ కోడ్ యూబీఐఎన్ 0806091లో చెల్లించాలి. ఆన్‌లైన్ ద్వారా ట్రాన్స్‌ఫర్ చేసిన భక్తులు వివరాలు, పూజ జరిపించాల్సిన వారి పేరు, గోత్రనామాలు, పూర్తి చిరునామా 89855 15989 నంబరుకు వాట్సాప్ చేయాలి.

వెంకన్నకు వైభవంగా పుష్పాంజలి సేవ


బల్లిగిరి వెంకన్నకు పుష్పసేవ చేస్తున్న వైదికులు

అల్లిపురం : బల్లిగిరి శ్రీ ప్రసన్న వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో శుక్రవారం పుష్పాంజలి కార్యక్రమం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామి వారిని దర్శించుకునేందుకు భక్తులు తెల్లవారు జాము నుంచి బారులు తీరారు. సాయంత్రం జరిగిన కార్యక్రమంలో ఆలయ అర్చకుడు గొడవర్తి రఘునాథాచార్యులు ఆధ్వర్యంలో దేవాలయాన్ని రంగు రంగుల పుష్పాలతో అలంకరించారు. ఆలయ మండపంలో అష్టదళ పద్మారాధన, పాలికా ఉద్వాసన, ద్వాదశార్చనలు, విశేష నివేదనలు, ఆలయ ప్రాంగణ ప్రదక్షిణలు చేపట్టారు. అనంతరం అర్చక స్వాములు నిర్వహించిన పూబంతుల ఆట భక్తులను విశేషంగా ఆకట్టుకుంది. స్వామికి నివేదించిన విశేష హారతులు భక్తులను అలరించాయి. అనంతరం స్వామివారి పవళింపు సేవ కనుల పండువగా చేపట్టారు. ఈ సందర్భంగా అన్నమాచార్య కీర్తనలు, గోవింద నామాలతో బల్లిగిరి మార్మోగింది. దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్మన్ బొడ్డేటి కిషోర్, ఆలయ ఈవో జీవీ రమాబాయి, భక్తులు పాల్గొన్నారు.

'ఉత్తర'లో సమర్థవంతంగా ఎన్నికలు నిర్వహించాం

రిటర్నింగ్ ఆఫీసర్ అఖిల



సీతమ్మధార: ఉత్తర నియోజకవర్గంలోని 275 పోలింగ్ కేంద్రాల్లో ప్రశాంత వాతావరణంలో సమర్థవంతంగా సార్వత్రిక ఎన్నికలు నిర్వహించామని డిప్యూటీ కలెక్టర్, ఉత్తర రిటర్నింగ్ ఆఫీసర్(ఆర్వో) డి.అఖిల తెలిపారు. ఎన్నికల నిర్వహణపై శుక్రవారం 'సాక్షి'తో ఆమె మాట్లాడారు. పోలింగ్ కేంద్రాల వద్ద ఎటువంటి అల్లర్లు జరగకుండా పటిష్ట భద్రత ఏర్పాటు చేశామన్నారు. ఓటర్లకు ఎటువంటి ఇబ్బందులు కలుగకుండా మౌలిక సదుపాయాలు కల్పించామన్నారు. అన్ని పోలింగ్ బూత్‌లను పరిశీలించామన్నారు. దివ్యాంగులు, వృద్ధులకు వీల్ చైర్లు, తాగునీరు, ఫ్యాన్‌లు వంటి సదుపాయాలు కల్పించామని చెప్పారు. గతంలో రిగ్గింగ్, గొడవలు జరిగిన పోలింగ్ స్టేషన్ల వద్ద పోలీసుల భద్రత ఏర్పాటు చేయడంతో ప్రశాంతంగా ఎన్నికలు జరిగాయన్నారు. కలెక్టర్ ఆదేశాలు, పోలీస్, రెవెన్యూ, జీవీఎంసీ అధికారులు, ప్రజల సహకారంతో ఉత్తరలో ఎన్నికలు విజయవంతంగా నిర్వహించామని పేర్కొన్నారు. తాను మొదటిసారి సార్వత్రిక ఎన్నికల్లో విధులు నిర్వహించానని ఆర్వో అఖిల

టెన్త్ సప్లిమెంటరీ పరీక్షలు ప్రారంభం


పరీక్ష రాసి బయటకు వస్తున్న విద్యార్థులు

సీతమ్మధార: పదో తరగతి సప్లిమెంటరీ పరీక్షలు శుక్రవారం ప్రారంభమయ్యాయి. టెన్త్‌లో ఫెయిలైన విద్యార్థులు ఈ పరీక్షలు రాశారు. సీతమ్మధార పీఅండ్‌టీ కాలనీలోని ఎస్ఎంసీ హైస్కూల్‌లో జరిగిన పరీక్షలకు 42 మంది విద్యార్థులు హాజరు కావలసి ఉండగా.. 31 మంది హాజరయ్యారు. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం వరకు పరీక్షలు జరిగాయి.

తాగునీరు లేక ఇబ్బందులు..

సప్లిమెంటరీ పరీక్షలకు వచ్చిన విద్యార్థులు తాగునీరు లేక ఇబ్బంది పడ్డారు. పాఠశాలకు వేసవి సెలవులు కావడంతో తాగునీటి అవసరం లేక పోయింది. దీంతో పరీక్షలకు హాజరైన విద్యార్థులకు మంచినీరు అందుబాటులో లేకుండా పోయింది. ఈ విషయమై స్కూల్ అటెండర్ శ్రీను 'సాక్షి'తో మాట్లాడుతూ నీటి సరఫరా కార్యాలయానికి తాను వెళ్లి విద్యార్థుల కోసం తాగునీరు అడగ్గా.. జీవీఎంసీ కమిషనర్ నుంచి అనుమతి రావాలని సిబ్బంది చెప్పడంతో నిరాసగా వెనుదిరిగి వచ్చానన్నాడు. అధికారులు స్పందించి తాగునీరు ఏర్పాటు చేయాలని విద్యార్థులు కోరుతున్నారు.

ఘనంగా దుర్గమ్మ ఆలయ వార్షికోత్సవం


ప్రత్యేక పూజల్లో శ్రీనుబాబు, గ్రామపెద్దలు

కంచరపాలెం: జీవీఎంసీ 46వ వార్డు కైలాసపురం పరిధి మధుసూదన నగర్‌లోని లక్ష్మీగణపతి, కనకదుర్గ అమ్మవారి ఆలయ 30వ వార్షికోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకుడు శ్రీనివాస్‌శర్మ నేతృత్వంలో సామూహిక కుంకుమ పూజలు, జల, క్షీరాభిషేకాలు, ప్రత్యేక పూజలు చేశారు. సింహాచలం దేవస్థానం ధర్మకర్తల మండలి మాజీ సభ్యుడు, జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు ఆలయాన్ని సందర్శించి అమ్మవారికి పూజలు చేశారు. పలు సాంస్కృతిక కార్యక్రమాలు, తిరువీధి మహోత్సవాలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ శీరంశెట్టి శంకర్, కమిటీ సభ్యులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

'నక్షత్ర ద స్టార్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్' పోస్టర్ ఆవిష్కరణ


పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఏయూ వీసీ ప్రసాదరెడ్డి

ఏయూక్యాంపస్: యువతలోని ప్రతిభను ప్రోత్సహించేందుకు రాష్ట్ర వ్యాప్తంగా 'నక్షత్ర ద స్టార్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్' కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాదరెడ్డి అన్నారు. ఏయూ ఆలుమ్ని సమావేశ మందిరంలో శుక్రవారం ఈ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కార్యక్రమ నిర్వాహకుడు, నటుడు షాహిద్ అబ్దుల్ మాట్లాడుతూ ఏపీ, తెలంగాణ రాష్ట్రాల్లో ఈ కార్యక్రమం నిర్వహిస్తామని.. ఏపీలో జూన్ 15 వరకు, తెలంగాణలో జూన్ 17 వరకు ఆన్‌లైన్‌లో రిజిస్ట్రేషన్లు స్వీకరిస్తామన్నారు. రెండు దశల్లో ప్రతిభను గుర్తించి, విజేతలుగా నిలిచిన వారికి ఫైనల్ పోటీలకు ఎంపిక చేస్తామన్నారు. విశాఖ వేదికగా ఫైనల్ పోటీలు జరుగుతాయని, పూర్తి వివరాలకు స్టార్ ఆఫ్ ఇండియా ఇన్‌స్టా పేజీని సందర్శించాలని సూచించారు. ఆర్ట్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఏ.నరసింహారావు మాట్లాడుతూ జూనియర్, సీనియర్ విభాగాలుగా మ్యూజిక్, డాన్స్, ఆర్ట్స్ రంగాల్లో అన్ని వయసుల వారి ప్రతిభను ప్రదర్శించే వేదికగా ఈ కార్యక్రమం నిలుస్తుందన్నారు. విద్యార్థి వ్యవహారాల డీన్ ఆచార్య ఎస్.విజయ్ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్‌లో ప్రవేశాలు షురూ..

- కృష్ణా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో దరఖాస్తుల స్వీకరణ
- ఇప్పటి వరకూ 134 స్పాట్ అడ్మిషన్‌లు
- ఒక్కో కోర్సుకు 88 సీట్లు
- ఎన్‌సీసీ యూనిట్ కళాశాల ప్రత్యేకత



డాక్టర్ వీఎస్ కృష్ణా జూనియర్ కళాశాల

మద్దిలపాలెం: ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం ప్రవేశాలు షురూ అయ్యాయి. మద్దిలపాలెంలోని డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ జూనియర్ కళాశాలలో దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ప్రారంభమైంది. దరఖాస్తులను ఈ నెల 18వ తేదీ నుంచి స్వీకరిస్తున్నారు. ఈ ప్రక్రియ ఈ నెల 30తో ముగియనుందని కళాశాల ప్రిన్సిపాల్ బి.సుజాత తెలిపారు. జూన్ 1వ తేదీ నుంచి ప్రథమ సంవత్సరం తరగతులు ప్రారంభించనున్నామని ఆమె పేర్కొన్నారు.

కోర్సులు.. సీట్ల వివరాలు

కళాశాలలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, హెచ్ఈసీ కోర్సులు ఉన్నాయి. ఈ కోర్సులు తెలుగు, ఇంగ్లిష్ మీడియంలలో సీట్లు అందుబాటులో ఉన్నాయి. ఒక్కొక్క కోర్సుకు 88 సీట్లు కేటాయించారు. కళాశాలలో అన్ని కోర్సులు కలిపి మొత్తం 704 సీట్లు ఉన్నాయి. వీటిలో ఇప్పటి వరకూ స్పాట్ అడ్మిషన్లలో శుక్రవారం నాటికి 134 మంది ప్రవేశాలు పొందారని ప్రిన్సిపాల్ తెలిపారు.

ఎన్‌సీసీ యూనిట్ ప్రత్యేకత

ఉత్తరాంధ్రలో ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్‌సీసీ యూనిట్ ఉన్న ఏకైక కళాశాల డాక్టర్ వీఎస్ కృష్ణా ప్రభుత్వ జూనియర్ కళాశాల. ఇదీ ఇక్కడ ప్రత్యేకత. దీంతో కళాశాలలో ప్రవేశాలకు మంచి డిమాండ్ ఉంటుందని ప్రిన్సిపాల్ తెలిపారు. క్రీడా మైదానం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుంది. ఈ కళాశాల నగరం నడిబొడ్డున ఉండడంతో రవాణాకు సౌకర్యవంతంగా ఉంటుంది.

నేరుగా ప్రవేశాలు

ఇంటర్మీడియెట్ ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలకు కళాశాల పని వేళల్లో వచ్చి దరఖాస్తు చేసుకుని నేరుగా ప్రవేశాలు పొందవచ్చు. స్పాట్ అడ్మిషన్ ప్రక్రియ అందుబాటులో ఉంది. దరఖాస్తుతో పాటు అవసరమైన సర్టిఫికెట్లు, జెరాక్స్ కాపీలు, ఆధార్ కార్డు, బ్యాంకు పాస్ పుస్తకం, పాస్‌పోర్టు సైజ్ ఫొటోలు, ఫీజు తీసుకుని వచ్చి ప్రవేశం పొందవచ్చునని ప్రిన్సిపాల్ తెలిపారు. ఎంపీసీ, బైపీసీ కోర్సులకు ఫీజు రూ.2,308, సీఈసీ, హెచ్ఈసీ కోర్సులకు రూ.1,406 ఫీజు చెల్లించాల్సి ఉంటుందని చెప్పారు.

కోర్సులు	సీట్లు	స్పాట్ అడ్మిషన్‌లు
ఎంపీసీ(ఇంగ్లిష్)	88	55
ఎంపీసీ(తెలుగు)	88	11
బైపీసీ(ఇంగ్లిష్)	88	18
బైపీసీ(తెలుగు)	88	07
సీఈసీ(ఇంగ్లిష్)	88	17
సీఈసీ(తెలుగు)	88	06
హెచ్ఈసీ(ఇంగ్లిష్)	88	15
హెచ్ఈసీ(తెలుగు)	88	05

చెట్టుకు ఉరేసుకుని వ్యక్తి ఆత్మహత్య


మృతదేహాన్ని పరిశీలిస్తున్న ఎస్ఐ రామారావు

వజ్రపుకొత్తూరు: అనంతగిరి పంచాయతీ వెంకటాపురం జీడితోటల్లో శుక్రవారం గొర్లె ఉమామహేశ్వరరావు(26) అనే వ్యక్తి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికుల ద్వారా విషయం తెలుసుకున్న వజ్రపుకొత్తూరు ఎస్ఐ సీహెచ్.రామారావు ఘటనా స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించారు. అక్కడున్న ఐడీకార్డు ఆధారంగా మృతుడు విశాఖపట్నంలోని నేవల్ డాక్‌యార్డులో లేబర్‌గా పనిచేస్తున్నట్లు గుర్తించారు. ఆనవాళ్లను బట్టి గురువారం రాత్రి ఉరి వేసుకున్నట్లు అనుమానిస్తున్నారు. గుర్తింపు కార్డు తప్ప మరెలాంటి ఆధారాలు దొరక్కపోవడంతో వివరాల కోసం నేవల్ డాక్‌యార్డును సంప్రదిస్తున్నామని ఎస్ఐ తెలిపారు. మృతుడు ఎరుపు చారలతో ఉన్న తెలుపు టీ షర్టు, నలుపు షార్టు(నిక్కర్)ధరించినట్లు చెప్పారు. మృతదేహాన్ని పలాస ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీకి తరలించామని, వివరాలను తెలిసిన వారు వజ్రపుకొత్తూరు పోలీసులను సంప్రదించాలని కోరారు. వీఆర్వో రెయ్యిమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.